# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **డ్రోన్ అంబులెన్స్ లను రాష్ట్రంలో ఈ ఏడాది ప్రారంభించాలనుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **అమరావతిలో ఈరోజు నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు.**

3. **మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

4. **మూడవ విడత ఆదరణ పథకంలో భాగంగా చేతి వృత్తిదారులకు శాశ్వత ఉపాధి కల్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ అంబులెన్స్ లను ఈ ఏడాది ప్రారంభించాలనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వీటితో రోగులను 15 నుంచి 30 నిమిషాల్లోపు ఆసుపత్రికి తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, కేంద్ర విదేశాంగ శాఖ సంయుక్తంగా దిల్లీలో నిర్వహించిన మేధోమథన వేదిక 'రైసినా డైలాగ్'లో ఆయన నిన్న ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక గిగావాట్ డేటా సెంటర్, ఏఐ హబ్ ఏర్పాటు కోసం గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోందని తెలిపారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత వస్తున్న అతి పెద్ద పెట్టుబడి ఇదేనాన్నారు. దీనికితోడు మేం ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రారంభిస్తున్నామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

దేశంలోని మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో, జాతీయ సమగ్రత, శాంతి, సామరస్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించారని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు ఎల్లప్పుడూ సమాజానికి ప్రేరణగా నిలిచారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజం రాజకీయాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మహిళల విజయాలను వెలుగులోకి తెచ్చేందుకు సమానత్వం, న్యాయం, గౌరవం కోసం వారి హక్కుల గురించి అవగాహన పెంచడానికి అంతర్జాతీయ

మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడించారు. సమాజంలో, కుటుంబ సంప్రదాయంలో, జాతి నిర్మాణంలో, మహిళలు తిరుగులేని నాయకత్వ పాత్రను పోషిస్తారని గవర్నర్ పేర్కొన్నారు.

---------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతిలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ రోజు నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ఆయన పేరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలపై రూపొందించిన ప్రజెంటేషన్లను ముఖ్యమంత్రి వీక్షిస్తారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో 36 ఒప్పందాలపై ఉన్నతాధికారులు సంతకాలు చేయనున్నారు. మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

---------------------------

మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదులోని జేఎన్టీయూ ఆడిటోరియంలో నిన్న నిర్వహించిన 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం అమలు చేస్తున్నామన్నారు. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులని, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

మూడవ విడత ఆదరణ పథకంలో చేతి వృత్తిదారులకు శాశ్వత ఉపాధి కల్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కురుమ సామాజిక వర్గ నాయకులు మంత్రిని నిన్న కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బిసిలకు ప్రాధాన్యత లభించిందన్నారు. త్వరలో వెయ్యి కోట్ల రూపాయలతో ప్రారంభించబోయే 3వ విడత ఆదరణ పథకంలో బీసీలకు అధునాతన పరికరాలు అందించి, శాశ్వత ఉపాధి కల్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

లొంగిపోయిన మావోయిస్టులపై ఉన్న కేసులను ఎత్తివేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. చట్టపరంగా ఎత్తివేయగలిగే కేసులను ఎత్తివేస్తామని.. తీవ్రమైన కేసులు ఉంటే పరిశీలిస్తామని, వ్యక్తులు, వారిపై ఉన్న నేరాల తీవ్రతను బట్టి ఆలోచిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 130 మంది మావోయిస్టులు ముఖ్యమంత్రి ఎదుట నిన్న లొంగిపోయారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం తద్వారా దేశం ఆరోగ్యవంతంగా ఉంటుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ మండలం పెదఅమిరంలో నిర్వహించిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 28న రాజస్థాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. నిర్ధారిత వయస్సు గల ప్రతి బాలికకు ఈ వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

-------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1975లో ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు ప్రతి ఏడాది మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సభ్యదేశాలు అమలు చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మహిళా శక్తిని చాటి చెప్పే విధంగా ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-------------------------

ప్రపంచ స్థాయి ఏఐ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని ఒక కళాశాలలో సీఎఫ్ఓ సదస్సు నిన్న జరిగింది. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భాగ్యనగరాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

-------------------------

ఒడిషా పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని, ఈ ఉపరితల ఆవర్తనం నుంచి కోస్తా, కర్ణాటక వరకూ, తెలంగాణ, అంతర కర్ణాటక అంతర్భాగంగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణలో వాయువ్య, నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈ రోజు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్…27 సెకన్లు

తెలంగాణలో రానున్న 5 రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది.

-------------------------

ఐసిసి పురుషుల టి 20 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా ఫైనల్ మ్యాచ్ ఈ రోజు జరగనుంది. ఫైనల్ కు చేరుకున్న ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య ఈ మ్యాచ్ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది.

====================